భారీగా టెట్ ఫీజులు.. నిరుద్యోగుల గగ్గోలు

- టెట్‌కు వెయ్యి, 2వేలు కట్టాల్సిందే
- ఆశించినా.. ఫీజులు తగ్గించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఒక్కో పేపర్‌కు ఏపీలో రూ. 750, మన దగ్గర రూ.1,000
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నో రాయితీ
- ఆన్‌లైన్ పేరిట ఫీజుల వడ్డన
- పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెబుతాం: నిరుద్యోగులు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : ఆందోళనలు.. నిరసనల ప్రభావంతో టెట్ ఫీజులు తగ్గిస్తారనుకొన్న నిరుద్యోగుల ఆశలను రేవంత్ సర్కారు వమ్ముచేసింది. టెట్ ఫీజులను తగ్గించబోమని సంకేతాలిచ్చింది. టెట్ పేపర్-1కు రూ.1,000, టెట్ రెండు పేపర్లకు రూ.2 వేలు ముక్కుపిండి వసూలు చేసేందుకు సిద్ధపడింది. టెట్ ఫీజులు పెంచడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, అభ్యర్థులు ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. 150శాతం నుంచి 300శాతం ఫీజుల పెంపును నిరసిస్తూ బీఈడీ, డీఎడ్ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతున్నారు. పుస్తకాలు వదిలి రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. విద్యార్థి సంఘాలు ఈ ఉద్యమానికి బాసటగా నిలుస్తున్నాయి. ఈ పోరాటాలకు ప్రభుత్వం దిగివచ్చి టెట్ ఫీజులను తగ్గిస్తుందని అంతా భావించారు. బుధవారం నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఫీజుల తగ్గింపుపై స్పష్టమైన ప్రకటన ఉంటుందని అంతా ఆశించారు. కానీ, ఫీజుల తగ్గింపుపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీనిపై అధికారులను ఆరాతీస్తే ఇంతవరకు తమకేం సమాచారం లేదని, రూ.వెయ్యి, రూ.2 వేల ఫీజును కట్టాల్సిందేనని స్పష్టంచేశారు. నిరుద్యోగులు ఇంతగా మొత్తుకొంటున్నా.. గగ్గొలుపెడుతున్నా.. రేవంత్ సర్కారు పట్టించుకోకపోవడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధిచెబుతామని హెచ్చరిస్తున్నారు.

ఏపీలో రూ. 750 ఫీజు మాత్రమే

టెట్ ఫీజులు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలతో సమానంగా ఉన్నాయి. మన పక్కనే ఉన్న ఏపీలో టెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. అక్కడ ఒక్కో పేపర్‌కు రూ. 750 మాత్రమే ఫీజుగా తీసుకొంటున్నారు. కానీ మన దగ్గర రూ.1000 తీసుకోవడం గమనార్హం. కనీసం ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులకు ఫీజులో రాయితీ ఇవ్వడంలేదు. జాతీయంగా ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ పరీక్షకు రూ.వెయ్యి ఫీజుగా వసూలు చేస్తున్నారు. టెట్ క్వాలిఫైయింగ్ ఎగ్జామ్ మాత్రమే. దీని వల్ల ఉద్యోగాలొచ్చేది లేదు.. ఇస్తారన్న గ్యారంటీ లేదు. కేవలం వెయిటేజీ మాత్రమే ఉంటుంది. దీనికి వెయ్యి రూపాయలెందుకన్న ప్రశ్నలు నిరుద్యోగుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. పైగా టెట్‌ను రాష్ట్రంలోని 11 జిల్లా కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తారు. అంటే టెట్ పరీక్ష రాయాలంటే ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ప్రయాణం చేయాల్సిందే. అంటే ప్రయాణ భారం అదనంగా పడనున్నది. దీనిపైనా నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు.

ఆన్‌లైన్‌తోనే.. అమాంతం..

టెట్‌ను ఇది వరకు ఆఫ్‌లైన్‌లో నిర్వహించడంతో పరీక్ష ఫీజు రూ. 200, 300, 400గా మాత్రమే ఉండేది. కానిప్పుడు తొలిసారిగా టెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. దీంతో టెట్ పరీక్షలను టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో మాత్రమే నిర్వహిస్తారు. ఈ పరీక్షను నిర్వహించినందుకు టీసీఎస్ అయాన్ ఒక్కో విద్యార్థిపై రూ. 495 ఫీజుగా వసూలు చేస్తుంది. ఆన్‌లైన్‌లో నిర్వహించడంతో 18 శాతం జీఎస్టీ పడుతుంది. ఇలా పరీక్షను ఆన్‌లైన్‌కు మార్చడంతో టెట్ ఫీజులు అమాంతం పెరిగాయి. పైగా ఆఫ్‌లైన్‌లో పరీక్షలను నిర్వహిస్తే పేపర్ లీకవుతుందన్న ఆందోళన ప్రభుత్వాన్ని వెన్నాడుతున్నది. పేపర్లు లీకైతే ప్రభుత్వం బద్నాం కావాల్సి ఉంటుందన్న ఆలోచనతోనే ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించేందుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. కానీ ఈ వ్యూహాత్మక తప్పిదంతో అసలుకే మోసానికి దారితీస్తున్నది. స్థూలంగా నిరుద్యోగుల ఆగ్రహానికి, ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణమవుతున్నది.

టెట్ ఫీజులు మంచినీళ్ల ప్రాయం..

ఇక టెట్ ఫీజులను విద్యాశాఖ అధికారులు మంచినీళ్ల ప్రాయంలా ఖర్చుచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇష్టారీతిన ఖర్చుపెడుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. గతంలో నిరుద్యోగ అభ్యర్థుల నుంచి కోట్లల్లో వసూలు చేసిన ఫీజుల్లో కొంత మొత్తాన్ని విద్యాశాఖ కార్యాలయాల్లో మరమ్మతులు, కోర్టు కేసులకు వాడినట్టుగా విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్యాలయ నిర్వహణకు విద్యార్థుల సొమ్ములేంటని ప్రశ్నిస్తున్నాయి. టెట్ డబ్బులు అంటేనే విద్యాశాఖకు అక్షయపాత్ర అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, హైదరాబాద్ ఆర్జేడీ కార్యాలయంలో ఏసీలకు రూ. 8లక్షలు ఖర్చు చేశారని పేర్కొంటున్నాయి. 15 ఏండ్లుగా ఇష్టారీతిన ఖర్చుచేస్తున్నారని మండిపడుతున్నాయి. టెట్ వ్యయంలోనూ భారీగా అవినీతి జరిగి ఉంటుందని, ఆడిటింగ్ నివేదికలను బయటపెట్టాలని, విచారణ చేపట్టాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెబుతాం

ప్రభుత్వం నుంచి మేం ఆశించింది వేరు.. అధికారంలోకొచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది వేరు. ప్రజా ప్రభుత్వమంటే ఇట్లా ఉంటుందని మేం అస్సలు అనుకోలేదు. మమ్మల్ని ఎన్నికల్లో పావులుగా వాడుకొని ఇప్పుడు వదిలేశారు. కనీసం మా ఆందోళనలను, నిరసనలను పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణం. అధికారదర్పంతో ఫీజులు పెంచిన సర్కారుకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెబుతాం.

– ఐలీ కవిత, నిరుద్యోగి, హైదరాబాద్

పేద విద్యార్థులపై పెనుభారం

టెట్ ఫీజులను పెంచడం వల్ల నిరుపేద విద్యార్థులపై పెనుభారం పడుతుంది. ఒక పేపర్‌కు వెయ్యి, రెండు పేపర్లకు రెండు వేలు పెంచడం అత్యంత దారుణం. దీనిని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రూపాయి ఫీజు తీసుకోబోమని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. కానిప్పుడు ఎన్నికల హామీకి విరుద్ధంగా టెట్ ఫీజులను పెంచారు. వెంటనే టెట్ ఫీజులు తగ్గించాలి. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

అంతా ఫీజు ఎక్కడి నుంచి తేవాలి

నిరుద్యోగినైన నేను అష్టకష్టాలు పడి టెట్, డీఎస్సీకి ప్రిపేరవుతున్నా. ఇప్పటికిప్పుడు టెట్ కోసం వెయ్యి, రెండు వేలు ఎక్కడి నుంచి తేవాలి. నిరుద్యోగులకు ఫీజు మినహాయింపు ఇస్తామని అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ఇప్పుడు ఎందుకివ్వడంలేదు. ప్రభుత్వంపై మేం ఎంతో నమ్మకం పెట్టుకొంటే మా నమ్మకాలను పూర్తిగా వమ్ముచేశారు. ఆఖరుకు మాపై ఫీజుల భారం మోపారు. ఇంత కంటే మోసం మరొకటి ఉండదు.

– రమేశ్, నిరుద్యోగ అభ్యర్థి

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కే వాసుదేవరెడ్డి, చిత్రంలో సంజీవ్

టెట్ ఫీజు రద్దు చేయాలి

- బీఆర్ఎస్ పార్టీ నేత వాసుదేవరెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు రాసే టెట్ పరీక్ష ఫీజును వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నేత కే వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఫీజులు లేకుండానే పరీక్షలు నిర్వహించాలని కోరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత సంజీవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెట్ పరీక్షకు ఒక పేపర్‌కు రూ.200, మూడు పేపర్లకు రూ.300గా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక పేపర్ కు రూ.1,000, రెండు పేపర్లకు రూ.2,000గా నిర్ణయించడం దారుణమని విమర్శించారు. దరఖాస్తుదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని అభయహస్తం మ్యానిఫెస్టోలో పెట్టారని, ఆ హామీ మేరకు టెట్‌తో పాటు ఏ ఉద్యోగ పరీక్షకూ ఫీజులు వసూలు చేయొద్దని గుర్తుచేశారు. బుధవారం నుంచి టెట్ దరఖాస్తులు ప్రారంభంకానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల రద్దు ప్రకటన జారీ చేయాలని కోరారు. లేకుంటే టెట్ అభ్యర్థులతో కలిసి ఉద్యమిస్తామని వెల్లడించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను వాసుదేవరెడ్డి ఖండించారు. రాజకీయ వ్యాఖ్యలు మాని రైతుల శ్రేయస్సుకు పాటుపడాలని డిమాండ్ చేశారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి : ఏఐవైఎఫ్

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) దరఖాస్తు ఫీజును తగ్గించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్రసమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఫీజు తగ్గించిన తర్వాతే దరఖాస్తులను స్వీకరించాలని, 33 జిల్లాల్లో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే ధర్మేంద్ర తదితరులు రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం రాధారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో టెట్ ఒక పేపరు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేదని తెలిపారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం టెట్ పేపర్-1కు రూ.1,000, రెండు పేపర్ల ఫీజును రూ.2 వేలకు పెంచడం సరికాదని పేర్కొన్నారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి తీసుకొని పెంచిన టెట్ ఫీజులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

టెట్ రాసే టీచర్లకు అనుమతి తప్పనిసరి

- టెట్ కన్వీనర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ టీచర్లు టెట్ రాయాలంటే విద్యాశాఖ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సిందే. ఇలా అనుమతి పొందితేనే సరి.. లేదంటే నిబంధనలు ఉల్లంఘించినట్టుగా పరిగణిస్తారు. టెట్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. ఈ నేపథ్యంలో పలువురు టీచర్లు టెట్ పరీక్షకు దరఖాస్తుచేయాలని భావిస్తున్నారు. ఇందుకు విద్యాశాఖ నుంచి అనుమతి తీసుకోవాలా? లేదా ? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయంపై టెట్ కన్వీనర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డిని 'నమస్తే తెలంగాణ' ఆరా తీయగా, టెట్ పరీక్షనే కాకుండా.. ఏ పరీక్ష రాయాలన్నా టీచర్లు విద్యాశాఖ నుంచి అనుమతిపొందాలని సూచించారు. టీచర్ల పదోన్నతులు కల్పించేందుకు టెట్ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. దీంతో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) నుంచి స్కూల్ అసిస్టెంట్, స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎంగా పదోన్నతి పొందాలంటే టెట్‌లో క్వాలిఫై కావడం తప్పనిసరి అయ్యింది. దీంతో ఉపాధ్యాయ ఉద్యోగార్థులతో పాటు ఈ సారి సర్కారీ టీచర్లు సైతం పదోన్నతులు పొందేందుకు టెట్ రాయబోతున్నారు. గతంలో టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వగా, దీనిని సవరించి ఇటీవలే ప్రభుత్వం టెట్ జీవోల్లో మార్పులు చేసింది.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. సందేహాల నివృత్తికి అభ్యర్థులు 70757 01768, 70757 01784 నంబర్లను సంప్రదించవచ్చు.

పీఆర్సీ డౌటే!

మొదటిపేజీ తరువాయి...

అధికారి ఎన్ శివశంకర్ నేతృత్వంలో రెండో పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఆరు నెలల్లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ గడువు ఏప్రిల్ 2తో ముగియనున్నది. ప్రస్తుతం ఈ కమిటీ పలు సంఘాలు, సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నది. ఎన్నికల కారణంగా కసరత్తు పూర్తిచేయలేకపోయామని, కాబట్టి గడువును మరో ఆరు నెలలు పొడగించాలని ప్రభుత్వాన్ని పీఆర్సీ కమిటీ కోరినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో గడువు పొడిగించవచ్చా? లేదా? అన్న అనుమానాలు తలెత్తాయి. పీఆర్సీ కమిటీ గడువు పెంచే అంశం ప్రస్తుతానికి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. దీనిపై ఓ అధికారిని అడగ్గా రెండు మూడు రోజుల్లో గడువు పెంపు ఉత్తర్వులు విడుదలవుతాయ ని చెప్పారు.

2023 జూలై నుంచి..

పాత పీఆర్సీ గడువు గత జూన్ 30తో ముగియగా, 2023 జూలై 1 నుంచి రెండో పీఆర్సీని వర్తింపజేయాల్సి ఉన్నది. నూతన పీఆర్సీలో ప్రభుత్వం అంగీకరించిన ఫిట్‌మెంట్ మొత్తాన్ని 2023 జూలై నుంచి చెల్లించాలి. వీటినే పీఆర్సీ బకాయిలుగా వ్యవహరిస్తారు. గత కేసీఆర్ ప్రభు త్వం ఒక పీఆర్సీకి మరో పీఆర్సీకి మధ్య కాలానికి గల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు 5% మధ్యంతర భృతిని ప్రకటించింది. ఈ బకాయిలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మానిటరీ బెనిఫిట్స్ రూపంలో ఇస్తుందా? నోషనల్ బెనిఫిట్స్ రూపంలో ఇస్తుందా? అన్న సందిగ్ధంలో ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా, వాటినైనా ఇస్తే బాగుండేదన్న చర్చ ఉద్యోగవర్గాల్లో వినిపిస్తున్నది.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండర్ ప్రకటన నం. DRM/Works/BZA/07/2024, తేది: 04-03-2024

PUB0308

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతిదానికి ఎదురుగా తెలిపిన తేదీన 15.00 గంటల వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం. 01: టెండరు నం. E-07-South-2024, పని పేరు: SW-I) GDR-BZA సెక్షన్-BTTR-SSE/W/BTTR సెక్షన్‌లో సర్వీస్ భవనాలకు మరమ్మతులు & డ్రైనేజీ సిస్టం మెరుగుదల. SW-II) GDR-BZA సెక్షన్-SSE/W/NLR సెక్షన్‌లో LC గేట్లు 08 నం.లు (107, 108, 111, 112, 113, 116, 117 & 118)కు బ్లాక్‌టాప్ సర్ఫేస్‌తో మరమ్మతులు. **టెండరు విలువ:** రూ. 1,15,72,759/-, **బయానా:** రూ. 207900/- **పూర్తి చేయు కాలం:** 06 (ఆరు) నెలలు, **ముగింపు తేది:** 25-03-2024.

క్ర.సం. 02: టెండరు నం. E-09-North-BZA-2024, పని పేరు: BZA-VSKP సెక్షన్-చేబ్రోలు-దువ్వాడ స్టేషన్ల మధ్య నీటి సరఫరా సిస్టం మరియు ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటు. **టెండరు విలువ:** రూ. 2,23,64,603/-, **బయానా:** రూ. 2,61,800/-, **పూర్తి చేయు కాలం:** 09 (తొమ్మిది) నెలలు, **ముగింపు తేది:** 25-03-2024.

క్ర.సం. 03: టెండరు నం. E-02-Bridges-BZA-2024, పని పేరు: BZA డివిజన్: BZA-GDR & BZA-BVRM సెక్షన్స్: SSE/Br/II/BZA అధికార పరిధిలో సెక్షన్ వేగం 130 Kmph పెంచుటకు బదులుగా క్రాస్ లెవెల్స్ & లాంగి ట్యూడినల్ లెవెల్స్ పటిష్టపరుచుట, సరిచేయుట ద్వారా GDR-BZA & BZA-BVRM స్టేషన్ల మధ్య ఓపెన్ వెబ్ గిర్డర్ బ్రిడ్జిలు (ముఖ్యమైన బ్రిడ్జి నం. 3 KB వెస్ట్, ప్రధాన బ్రిడ్జి నం.లు 185 UP, 60 DN & 168 UP) పటిష్ట పరుచుట. **టెండరు విలువ:** రూ. 2,28,28,910/-, **బయానా:** రూ. 2,64,200/-, **పూర్తిచేయు కాలం:** 09 (తొమ్మిది) నెలలు, **ముగింపు తేది:** 02-04-2024.

క్ర.సం.04, **టెండరు నం.** E-03-Bridges-BZA-2024, **పని పేరు:** BZA డివిజన్: GDR-BZA సెక్షన్: 130 KMPH వేగం పెంచిన కారణంగా SSE/Br/BTTR అధికార పరిధిలో భద్రత సిబ్బంది కొరకు GDR-OGL స్టేషన్ల మధ్య కరోడెడ్/ పర్ఫోరేటెడ్ మెంబర్స్‌ను రీప్లేస్ చేస్తూ పొడవైన బ్రిడ్జిలు (273UP, 275UP & DN, 279 UP & DN, 419 UP & DN & 516 DN)పై సైడ్ వాక్‌వే ఏర్పాటు మరియు బ్రిడ్జిలు (273 UP & 282 UP)ను పటిష్టపరుచుట. **టెండరు విలువ: రూ.** 36388257/-, **బయానా: రూ.** 332000/-, **పూర్తిచేయు కాలం:** 09 (తొమ్మిది) నెలలు, **ముగింపు తేది:** 28-03-2024.

క్ర.సం.05, **టెండరు నం.** E-04-Bridges-BZA-2024, **పని పేరు:** BZA-GDR సెక్షన్: SSE/Br/II/BZA సెక్షన్‌లో ముఖ్యమైన బ్రిడ్జి నం. 3KB వెస్ట్ (కృష్ణా బ్రిడ్జి) యొక్క మెటలైజేషన్. **టెండరు విలువ: రూ.** 25094296/-, **బయానా: రూ.** 275500/-, **పూర్తిచేయు కాలం:** 09 (తొమ్మిది) నెలలు, **ముగింపు తేది:** 28-03-2024.

కాగోరు టెండరుదారులు ఏదైనా టెండరుకు ఏవైనా మార్పులు/ సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వెబ్‌సైట్ "www.ireps.gov.in"ను దర్శించాలని సూచించబడుచున్నారు.

డివిజినల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ

A0388

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https:// www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

నూతన హైకోర్టుకు నేడు శంకుస్థాపన

- హాజరుకానున్న సీజేఐ చంద్రచూడ్
- భారీ బందోబస్తు మధ్య భూమిపూజకు ఏర్పాట్లు

వ్యవసాయ యూనివర్సిటీ/హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రాజేంద్రనగర్ వద్ద బుద్వేల్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ భూమిలో నూతన హైకోర్టు భవనాల నిర్మాణాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం భూమిపూజ చేయనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులు హాజరు కావటం లేదని తెలిసింది. అయితే, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఈసీకి లేఖ రాసినట్టు తెలిసింది. ఈ కార్యక్రమానికి మీడియాను అనుమతించలేదు. వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి రఘునందన్‌రావు, ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ నీరజాప్రభాకర్‌కు మాత్రమే అనుమతి ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి ఎవరినీ అనుమతించటం లేదు.

'పాలమూరు' కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయండి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు సాధించేందుకు ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబీపీ) కింద ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఆదేశించారు. సోమవారం ఆయన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులపై సంబంధిత ఈఎన్సీలు, ఎస్ఈలతో సమీక్షించారు. పనులు ఏ మేరకు పూర్తయ్యాయో అడిగి తెలుసుకున్నారు. సొరంగం పనులు ముందుకు సాగకపోవడానికి గల కారణాలను అధికారులు ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. దీంతో సాంకేతికంగా ఉన్న అడ్డంకులు, వాటి పరిష్కార మార్గాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని రాహుల్ బొజ్జా ఆదేశించారు.

ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరపండి

- బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోండి: కిషన్‌రెడ్డి
- చీఫ్ జస్టిస్‌తో కేసు విచారణ జరిపించాలి: రఘునందన్
- నేనూ ఫోన్‌ట్యాపింగ్ బాధితుడినే: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): తమ వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు కొందరు పోలీసు అధికారులు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం రాష్ట్రంలో పెను దుమారం రేపుతున్నది. ఈ వ్యవహారాన్ని దీంతో అధికార, ప్రతిపక్ష నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన అధికారులపై విచారణ జరిపి తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఫోన్లు ట్యాప్ చేసినట్టు భావిస్తున్నట్టు తెలిపారు. అవినీతి కుంభకోణాలకు పాల్పడటం, వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలు వసూలు చేయడం కోసం ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించుకోవడం అత్యంత దుర్మార్గమని, ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేత బీఎల్ సంతోష్ ఫోన్ కూడా ట్యాప్ చేశారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సంగారెడ్డిలో ఆరోపించారు. ఈ కేసును సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డీజీపీగా రిటైర్డ్ అయిన తర్వాత మహేందర్‌రెడ్డి ఇప్పుడెక్కడ ఉన్నారు? ఇద్దరు అధికారులను అమెరికాకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో ఈ కేసు విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తాను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన ఫోన్ ట్యాపింగ్‌లో ఉన్నదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం డీజీపీ రవిగుప్తాను కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు.

ప్రణీత్‌రావును మరో 5 రోజులు అప్పగించాలి

- కస్టడీకి కోరుతూ పంజాగుట్ట పోలీసుల పిటిషన్

నాంపల్లి కోర్టులు, మార్చి 26 (నమస్తే తెలంగాణ): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావును మరో 5 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు కోరారు. ఈ మేరకు మంగళవారం నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రణీత్‌రావుతోపాటు మాజీ ఏఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను సైతం 5 రోజుల కస్టడీకి అప్పగించాలని ఆ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీంతో నిందితుల తరపు న్యాయవాదికి మేజిస్ట్రేట్ కన్నయ్యలాల్ నోటీసులు జారీ చేయడంతో.. కౌంటర్ దాఖలుకు సమయం ఇవ్వాలని కోరారు. బుధవారం కౌంటర్ దాఖలు చేయడంతోపాటు వాదనలను త్వరగా పూర్తి చేయాలని మెజిస్ట్రేట్ స్పష్టం చేశారు.

- వాషింగ్ మెషీన్‌లో నోట్ల కట్టలు

విదేశీ మారక చట్టం ఉల్లంఘనకు సంబంధించిన కేసులో హైదరాబాద్‌తో సహా దేశంలోని పలు నగరాల్లో జరిపిన సోదాల్లో రూ.2.54 కోట్ల లెక్కలు చూపని నగదును స్వాధీనం చేసుకొన్నట్టు ఈడీ మంగళవారం వెల్లడించింది. ఇందులోని కొంత మొత్తాన్ని వాషింగ్ మెషీన్‌లో దాచి ఉంచగా.. దాన్ని సీజ్ చేశామని పేర్కొన్నది. రూ.1,800 కోట్ల మేర అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి అందిన సమాచారంపై కాప్రికార్నియన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్టర్లు విజయ్ కుమార్, సంజయ్ గోస్వామి నివాసాలతోపాటుగా కంపెనీ అనుబంధ సంస్థల ప్రాంగణాల్లో సోదాలు చేపట్టినట్టు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే ఎప్పుడు ఈ సోదాలు చేశారు? ఆ నగదు ఎక్కడ పట్టుబడిందనే దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు, ఎన్నికల వేళ రాష్ట్రంలో భారీగా నగదు, మద్యం పట్టుబడుతున్నది. 375 చెక్‌పోస్టులు.. ఆయా జిల్లాలు, మండలాల సరిహద్దుల్లో తనిఖీల ద్వారా మంగళవారం రాత్రి వరకు రూ.38,12,34,123 విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఉచితాలు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర సామగ్రి పట్టుబడింది.

ఆలోచనలను అంకురాలుగా మలిచేలా..

- ఫెమ్‌ప్రెన్యూర్ ద్వారా యంగ్ ఆంత్రప్రెన్యూర్లకు కోవే ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ఆలోచనలకు రూపమిస్తూ అంకురాలుగా మలిచే ఔత్సాహికులను ప్రోత్సహించడమే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ (కోవే) తెలంగాణ చేపట్టిన ఫెమ్‌ప్రెన్యూర్ కార్యక్రమానికి విశేష ఆదరణ వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అనుసంధానించిన అన్ని ఇంజినీరింగ్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కాలేజీల విద్యార్థులు చేపట్టిన ఉత్తమైన ఆలోచనలు, స్టార్టప్‌లను గుర్తించారు. వీరిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం గా.. ఏటా నిర్వహించే ఫెమ్‌ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా స్టార్టప్‌ల ఏర్పాటు, నిర్వహణకు అవసరమైన అవగాహన కల్పించారు. కోవే చేపట్టిన ఫెమ్‌ప్రెన్యూర్-2024 ముగింపు వేడుకలు ఎర్రమంజిల్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. రాష్ట్రంలో స్టార్టప్‌లు నెలకొల్పే ఆలోచనలు కలిగి ఉన్న 34 బృందాలలో ఆరిం టిని ఉత్తమమైనవిగా ప్రకటించారు. వీటిలో వ్యవసాయం, ప్రకృతి విపత్తులు, మహిళా సంరక్షణ, స్ట్రీట్‌ఫుడ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల స్టార్టప్ ఆలోచనలతో వచ్చిన బృందాలకు నగదు పురస్కారం, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో క్రియోటో సొల్యూషన్ సీఈవో సుమంత్ కృష్ణన్, కోవే తెలంగాణ ప్రెసిడెంట్ చేతన జైన్, యంగ్ కోవే చైర్మన్ శ్రీనిత్య పాల్గొన్నారు.

వేతనాలు పెంచండి

పీఆర్సీ చైర్మన్‌కు పంచాయతీ.. కార్యదర్శుల అసోసియేషన్ వినతి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శుల వేతనాల పెంపుపై ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం బీఆర్కే భవన్‌లో పీఆర్సీ చైర్మన్ ఎన్ శివశంకర్‌కు అసోసి యేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల నాలుగు గ్రేడ్లు వేతన స్కేళ్లను పెంచాలని, ఎఫ్‌టీఏ అలవెన్స్ సదుపాయం కల్పించాలని, గ్రేడ్ ఫోర్త్ స్కేలు జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌కు పెంచాలని కోరారు. గ్రేడ్ 3, 2 పంచాయతీ కార్యదర్శుల స్కేలు వేతనం పెంచాలని, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పేరు మార్చాలని విన్నవించారు. సమావేశంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రమేశ్, ఎంఎస్ఎస్ వాణి, కోశాధికారి జే పండరీనాథ్ ఉన్నారు.

గ్రూప్-1 ఎడిట్ ఆప్షన్ గడువు నేటితో ఆఖరు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో సవరణకు విధించిన ఎడిట్ ఆప్షన్ గడువు బుధవారంతో ముగియనున్నదని టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఉండదని, గడువు తేదీని పొడిగించబోమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అవసరమైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీయూఈటీ - యూజీ దరఖాస్తుల గడువు పెంపు

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్సిటీల్లో అండర్‌గ్రాడ్యుయేట్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ - యూజీ దరఖాస్తుల గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ నెల 31 వరకు పొడిగించింది. అభ్యర్థులు మార్చి 31 రాత్రి 9:50 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఏ తెలిపింది.

'50% ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయండి'

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల వేతన సవరణలో భాగంగా 50శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయాలని పీఆర్సీ కమిటీని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జీజేఎల్ఏ) కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి ప్రతిపాదనలు అందజేసింది. కనీస వేతనం రూ. 35వేలుగా ఖరారు చేయాలని, జూనియర్ లెక్చరర్ల పే స్కేల్ 1,19,200 నుంచి 2,92,400గా, ప్రిన్సిపాళ్ల పే స్కేల్ 1,37,600 నుంచి రూ. 3,07,600గా ఖరారు చేయాలని కోరారు.

నోటిఫికేషన్లలోని అన్ని పోస్టులను భర్తీ చేయాలి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఇచ్చిన నోటిఫికేషన్లలోని పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని మంగళవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. నోటిఫికేషన్లలోని అన్ని ఉద్యోగాలను భర్తీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా ట్రిబ్ అమలు చేయలేదు. దీంతో కొంతమంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ట్రిబ్, అభ్యర్థుల వాదనలు విన్న హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులిచ్చినట్టు సమాచారం.

రాజకీయ పెద్దల ప్రమేయంతోనే ఐఎంజీకి భూముల ధారాదత్తం!

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీ) కంపెనీకి 2003లో చంద్రబాబు నాయుడు సర్కారు హైదరాబాద్‌లో అక్రమంగా వేలకోట్ల రూపాయల విలువైన 855 ఎకరాల భూములను ధారాదత్తం చేయడం వెనుక నాటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉన్నదని, దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు బుధవారం హైకోర్టును కోరారు. ఈ వ్యవహారంలో ఐఎంజీ పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు కొట్టివేసిందని, దీనిపై ఆ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ప్రజాహిత వ్యాజ్యంగా హైకోర్టు విచారణ చేపట్టవచ్చని తెలిపారు. సుప్రీంకోర్టులో దాఖలైన అప్పీల్ పిటిషన్‌కు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలకు సంబంధం లేదని పేర్కొన్నారు. దీంతో ఈ అంశంపై ఏప్రిల్ మొదటి వారంలో విచారణ చేపడతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజయ్ పాల్ ధర్మాసనం ప్రకటించింది.